గొల్లపాళెం రోడ్డుకు మోక్షమెన్నడో?



గుంతలమయంగా గొల్లపాళెం రహదారి

గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణాలకు రూ.కోట్లు కుమ్మరిస్తున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు ఓ సారి మండపం పంచాయతీ గొల్లపాళెం ప్రధాన రహదారిని చూసి రావాలి. చంద్రశేఖరపురం నుంచి గొల్లపాళెం వరకు కిలో మీటరు మేర ఉన్న బీటీ రోడ్డు గత కొద్ది కాలంగా గుంతలమయంగా మారి వాహనదారులకు నరకాన్ని చూపుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక పంచాయతీ ప్రతినిధులు గత కొన్నేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికుల కష్టాల నడుమ ప్రయాణాలను సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు గొల్లపాళెం రహదారి మరమ్మతులకు నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

– తోటపల్లిగూడూరు

పాఠశాల ఆవరణలో పశువైద్యశాల



పాఠశాల ఆవరణలో ఉన్న పశువైద్యశాల

• విద్యార్థులకు తప్పని తిప్పలు

మండలంలోని దామరమడుగు ఉన్నత పాఠశాలలో పశువైద్యశాల ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పశు వైద్యశాలకు వచ్చే పశువులు అప్పుడప్పుడు తప్పించుకొని విద్యార్థులపైకి వెళ్తుంటాయి. దీంతో విద్యార్థులు భయపడిపోతున్నారు. పశు వైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతోనే ఇలా జరుగుతోంది. వాస్తవానికి పాఠశాల నిర్మాణానికి ముందే పశువైద్యశాల అక్కడుంది. పశువైద్యశాల దాదాపు 60 ఏళ్లుగా ఉంది. తర్వాతి కాలంలో ఇదే ఆవరణలో ఉన్నత పాఠశాలను నిర్మించారు. ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించారు. అందులోనే ఒక పక్క పశు వైద్యశాల నేటికీ అలాగే ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా పశువైద్యశాలకు ప్రహరీ నిర్మించకపోవడంతో పరిస్థితి భయానకంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

– బుచ్చిరెడ్డిపాళెం రూరల్

రక్షణ లేని కల్వర్టు



చిన్నచెరుకూరు సమీపంలో రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారిన కల్వర్టు

మండలంలోని చిన్నచెరుకూరు–కాకుపల్లి మార్గం మధ్యలో ఉన్న ఓ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. స్థానిక అంకమ్మ గుడి సమీపంలో ఉన్న కల్వర్టుకు ఉన్న రెండు రక్షణ గోడలు ఏడాది కిందట దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో రెండు గోడలు దాదాపు నేల కూలిపోయాయి. అసలే ఇరుకైన కల్వర్టు అందులోనూ రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలు ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ ఏ మాత్రం ఆదమరిచినా వాహనాలు పక్కనే ఉన్న లోతైన కాలువలోకి పడిపోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది.

– తోటపల్లిగూడూరు

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



కొడవలూరు: మండలంలోని గండవరానికి చెందిన గోళ్ల ప్రసాద్, లక్ష్మి దంపతుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం దగ్ధమై సర్వం కోల్పోవడం తెలిసిందే. ఈ క్రమంలో వారికి స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం ఇచ్చారు. ఈ నగదును మండల నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి గండవరంలోని బాధితుల ఇంటికి వెళ్లి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉదయకేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, నీటి సంఘ అధ్యక్షుడు కంచి ఈశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు బి.సురేష్, వి.సిద్ధార్థ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని పుట్టహౌస్‌వీధిలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కృష్ణుని ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, త్రైత సిద్ధాంత భగవద్గీత పారాయణం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం శ్రీకృష్ణుని విగ్రహాన్ని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తహసీల్దార్‌కు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అభినందించారు. అవార్డు అందుకున్న ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శాంతిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయునికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో కొలువైన వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి అయిన 13 మంగళవారాల తర్వాత గౌడ్ సేవా సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించి పూజలను నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఆదాయ శాఖకు అద్దె భవనమే దిక్కు

• స్థలమున్నా నిర్మాణానికి నోచుకోని రిజిస్ట్రార్ కార్యాలయం
• పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. నిత్యం భూముల కొనుగోలు, అమ్మకాలు, ఇల్లు రిజిస్ట్రేషన్ తదితర మార్గాల్లో ఆదాయం పొందే శాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా నిత్యం ఆదాయం సమకూరుతోంది. అలాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుచ్చిరెడ్డిపాళెంలో అద్దె భవనంలో కొనసాగుతుండటం ఆశ్చర్యకరంగా ఉంది. ఎంతమంది అధికారులు మారినా వేలకు వేలు అద్దె చెల్లిస్తున్నారే తప్ప కార్యాలయ నిర్మాణానికి చొరవ చూపడం లేదు.

మౌలిక వసతుల లేమి

రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీసం మౌలిక వసతులు కరువయ్యాయి. తాగునీరు, టాయిలెట్లు, కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి వేచి ఉండలేక ఇంటికి తిరిగి వెళ్తున్నారు. మరుసటి రోజు వచ్చి పని పూర్తి చేసుకుని వెళ్తున్నారు.

నిరుపయోగంగా స్థలం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కేటాయించిన స్థలం నిరుపయోగంగా ఉంది. సొంత స్థలం ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి కార్యాలయ నిర్మాణం చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉంది. గతంలో అనేకసార్లు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పట్టణ ప్రజలు వినతిపత్రం అందజేశారు. కార్యాలయ నిర్మాణం చేపడుతామని చెప్పారే తప్ప ఇప్పటివరకు ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

అక్రమ వసూళ్లపైనే దృష్టి

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా వివిధ భవనాలు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయడానికి వాటి విలువ కన్నా ఎక్కువగా సిబ్బంది వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో అక్రమ వసూళ్లపై జిల్లా అధికారులు అనేకసార్లు చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇకనైనా అధికారులు అక్రమ వసూళ్లపై చూపిన శ్రద్ధ, సొంత భవన నిర్మాణంపై చూపితే బాగుంటుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.20తో రూ.2 లక్షల బీమా



మాట్లాడుతున్న ఆర్ఎం సత్యనారాయణ స్వామి

మనుబోలు: రూ.20 చెల్లిస్తే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రూ.2 లక్షల బీమా అందుతుందని ఎస్బీఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణస్వామి అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో ఎస్బీఐ జన్ సురక్ష యోజన పథకంపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్బీఐ అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ జన్‌ధన్ ఖాతాలు కలిగి ఉండాలని సూచించారు. మహిళలు పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. రూ.20తో ప్రధాన మంత్రి సురక్ష యోజన, రూ.36తో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన ద్వారా ఏదైనా అనారోగ్యం, ప్రమాదం జరిగితే వెంటనే రూ.2 లక్షలు అందుతుందని తెలిపారు. గ్రామాల్లో ఖాతాలు లేని వారిని గుర్తించి వెంటనే తెరిపించాలని సూచించారు. ఎస్బీఐ బీఎం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌బీఐ ద్వారా అందే రుణాలు, బీమా పథకాలపై అవగాహన కల్పించేందుకే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీఐ గూడూరు శాఖ చీఫ్ మేనేజర్ శర్మ, ఫీల్డ్ ఆఫీసర్లు రమేష్, లక్ష్మణ్, అసోసియేట్ బీవీ రత్నం, ఏరియా హెడ్ శివప్రసాద్, జనరల్ హెడ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈ వెంకటేశ్వర్లురెడ్డి

కోవూరు: మండల పరిధిలో పేదల గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ తమ పరిధిలో జరుగుతున్న పేదల గృహ నిర్మాణాలను రోజూ పరిశీలించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనుల్లో వస్తున్న ఇబ్బందులను గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాలు నాణ్యతతో పాటు సమయానికి పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఇళ్ల పనులు పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చూపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

కోవూరు: రేషన్ దుకాణాల డీలర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య స్పష్టం చేశారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల చౌక డిపో డీలర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 15వ తేదీలోపు రేషన్ సరుకుల పంపిణీని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్టాక్ వివరాలు ప్రదర్శించాలన్నారు. సమావేశాలకు రాని వారి వివరాలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు. సీఎస్‌డీటీ బాలకోటమ్మ మాట్లాడుతూ కార్డుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను డీలర్లు పట్టించుకోవాలని, ఎక్కువ సమయం షాపులు మూసి వేయకూడదన్నారు. సమావేశంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలంలోని పలువురు డీలర్లు పాల్గొన్నారు.

కందలపాడులో పశువైద్య శిబిరం

వెంకటాచలం: మండలంలోని కందలపాడు గ్రామంలో మండవ ఫౌండేషన్, పశుసంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండవ ఫౌండేషన్ వైద్యుడు శ్రీనివాసులు నాయుడు, కనుపూరు పశువైద్యాధికారి మేఘనాథ్ సింగ్‌లు గేదెలు, దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందు పంపిణీ చేశారు. పాడి పరిశ్రమలో రైతులు లాభాల దిశగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

హుండీ కానుకల లెక్కింపు నేడు

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గా హుండీల నగదు(కానుకలు) లెక్కింపు బుధవారం ఉదయం జరుగుతుందని దర్గా కేర్ టేకర్ అస్లాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, దర్గా ముజావర్లు, గ్రామస్తుల సమక్షంలో కానుకల లెక్కింపు జరుగుతుందని తెలియజేశారు.

సర్వీస్ రిక్వెస్ట్‌లను సకాలంలో పూర్తి చేయండి

నెల్లూరు(బారకాసు): అడ్మిన్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న సర్వీస్ రిక్వెస్ట్‌లను వేగవంతంగా క్లియర్ చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సూచించారు. రెవెన్యూ శాఖ వారాంతపు సమీక్షను ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐజీఆర్ఎస్ అసెస్మెంట్లను క్రమం తప్పకుండా పరిశీలించి ఆన్‌లైన్‌లోనే పూర్తిచేయాలని సూచించారు. ట్యాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అదనపు అంతస్తులకు పన్నులను విధించాలన్నారు. ఖాళీ స్థలం, డ్రెయినేజీ పన్నులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. పన్ను బకాయిలున్న అన్ని ఖాళీ స్థలాల్లో యజమానులకు సూచనలు జారీ చేస్తూ నోటీసు బోర్డులు ప్రదర్శించాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, సూపరింటెండెంట్ చినబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): శ్రావణమాసం 4వ మంగళవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత మూలవర్లకు ప్రధాన అర్చకులు సూరావఝుల రఘురామమూర్తి ఆధ్వర్యంలో పూజల్ని విశేషంగా నిర్వహించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన రెడ్డి పర్యవేక్షించారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ కోరారు. మండలంలోని దామేగుంటలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు ఇంటికే వచ్చి ఉచిత వైద్యం అందించే బృహత్తర కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ అని తెలిపారు. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇలాంటి వారు స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం ఇస్తే ఇంటికే వైద్యులు వచ్చి చికిత్స అందిస్తారన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, హెచ్ఏ శ్రీనివాసులు, హెచ్‌వీ రమణమ్మ, టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన



పొదలకూరు: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన మహోత్సవం మంగళవారం జరిగింది. తొలుత 108 నూతన రాగి కలశాలను స్థాపన చేసి అందులోని నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ వాకాటి రాఘవ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రిపుర సుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): శ్రావణమాస నాలుగో మంగళవారం సందర్భంగా స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ఉభయకర్తలుగా వడ్లపూడి శ్రీరాములుశెట్టి, మస్తానమ్మ, సముద్రాల వెంకట శ్రీనివాసులు, మస్తానమ్మ వ్యవహరించారు. సాయంత్రం పూలంగిసేవ విశేషంగా జరిగింది. రాత్రి 8 గంటలకు శ్రీసౌభాగ్య పూజ నిర్వహించారు. 108 మంది మహిళలకు పసుపుకుంకుమ, గాజులు అందజేశారు. ఉభయ కర్తలుగా జి.వెంకటసుధాకర్, పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమాలను పాలకమండలి కమిటీ పర్యవేక్షించింది.

ఆధార్ అనుసంధానానికి నేడే ఆఖరు



కొడవలూరు: గండవరంలో..

కొడవలూరు: రైతుల ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేసుకునేందుకు బుధవారం తుది గడువు అని ఏఓ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని గండవరం, కొత్తవంగల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల బ్యాంక్ ఖాతాకు వారి ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల అన్నదాత సుఖీభవ నగదు వారి ఖాతాలకు వేయడం నిలిచిపోయిందన్నారు. ఇలాంటి రైతులంతా వెంటనే బ్యాంక్‌కు వెళ్లి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు విధిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే పంట నమోదు తప్పనిసరన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్ కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ ఎస్.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

➔ **కోవూరు:** మండల పరిధిలోని చెర్లోపాళెం, పడుగుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల ఏఓ ఎస్.రజని పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. పంట దిగుబడి పెరిగేందుకు, నేల సారాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

➔ **విడవలూరు:** రైతులందరూ పంటల నమోదు చేయించుకోవడం ఉపయోగకరమని మండల ఏఓ లక్ష్మి అన్నారు. మండలంలోని అలగానిపాడు, పార్లపల్లి గ్రామాల్లో ఉన్న రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు పంట బీమా చేయించుకోవాలని కోరారు. అనంతరం స్థానిక పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏలు కె.శ్రావ్య, శ్వేతలేఖ, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం మెరుగు

మనుబోలు: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం మెరుగుపడుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.శివనాయక్ అన్నారు. మండలంలోని వీరంపల్లి, అక్కంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో పిల్లిపెసర, జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి దుక్కి దున్నితే భూసారం పెరుగుతందన్నారు. నారుమళ్లు వేసే ముందు భూసార పరీక్షలు జరిపించుకుని దానికి తగినట్లు అనుకూలమైన పంటల సాగు, ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. నాట్లు వేసిన 25 నుంచి 35 రోజుల్లో నానో యూరియా, డీఏపీ వేస్తే పైరుకు నత్రజని అందుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఏఓ వెంకటకృష్ణ, వీఏఏలు విజిత, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు



విడవలూరు: పొలాలను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి



మనుబోలు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివనాయక్